క్లుప్తంగా

అభివృద్ధి పనులను పరిశీలించిన చైర్మన్



అధికారులతో చర్చిస్తున్న చైర్మన్

డోన్ టౌన్ : డోన్ కొండపై రూ.14.5లక్షలతో చేపట్టిన పార్కు అభివృద్ధి, వంద అడుగల జాతీయ జెండా ఏర్పాటు పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆగస్టు 15వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, జిందాల్ ఫ్యాక్టరీ మేనేజర్ కేశవరెడ్డి, కౌన్సిలర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏడీఈ ఖాజావలి చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

కోవెలకుంట్ల: మణిపూర్‌లోని గిరిజన మహిళలపై జరిగిన అత్యాచారాలకు నిరసనగా ఆదివారం పట్టణంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు, ది బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. బీఎస్ఐ ప్రెసిడెంట్ ఓబయ్య, కరస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ అస్సాం ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. గిరిజన మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి ఉరిశిక్ష విధించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అల్లర్లు జరగకుండా శాంతిభద్రతలను కాపాలని డిమాండ్ చేశారు.

మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకోవాలి

బేతంచెర్ల : పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితి పండుగకు మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకోవాలని పట్టణ గణేష్ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు ఉసేన్‌రెడ్డి, మారుతి కృష్ణ, గుండా గోపాల్, నాగమోహన్ సూచించారు. ఆదివారం పట్టణంలోని ఆలయ ఆవరణలో పట్టణ వినాయక ఉత్సవ మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గణేష్ ఉత్సవ కేంద్ర సమితి నిబంధనల మేరకు విగ్రహాలు నెలకొల్పడం మొదలుకుని నిమజ్జనం వరకు నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి



విద్యార్థినికి నగదు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ పిలుపునిచ్చారు. డోన్ ఆవోపా ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు మాకం కృష్ణకిషోర్, జొన్నలగడ్డ శ్రీనివాసుల సమక్షంలో పేద ఆర్యవైశ్య విద్యార్థులకు హరికిషన్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యానిధి ద్వారా విరాళాలు సేకరించి ఆర్యవైశ్య పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జిల మంజూరుపై హర్షం

డోన్ టౌన్ : మండలంలోని వలిసెల గ్రామ ప్రజలు దశాబ్దాల కాలం నుంచి ఎదుర్కొంటున్న రైల్వే ట్రాక్ కష్టాలు తీరనున్నట్లు ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రమణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామం నుంచి చిన్న మల్కాపురం, డోన్ పట్టణాలకు రావాలంటే అడ్డుగా ఉన్న రైల్వే ట్రాక్‌ను దాటుతూ ప్రమాదాలకు గురి కావల్సి వచ్చేందన్నారు. సమస్యను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రైల్వే అధికారులతో సంప్రదించి రెండు అండర్ పాస్ బ్రిడ్జిలు, ఫ్లైఓవర్ బ్రిడ్జి మంజూరు చేయిండం జరిగిందన్నారు. ఇప్పటికే గ్రామంలో రహదారి, మంచినీటి ట్యాంక్ నిర్మాణాలు, సీసీ రోడ్డు ఏర్పాటు చేయడంతో ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని చెప్పారు.

సన్మానం

డోన్ టౌన్ : రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై నంద్యాల తాలూక స్టేషన్‌కు వెళ్తున్న గౌస్ మోద్దీన్‌ను, హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఆళ్ళగడ్డ స్టేషన్‌కు బదిలీ అయిన గోకారిని ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. వారికి ఏఎస్ఐ గోపాల్, హెడ్‌కానిస్టేబుల్ శివప్రసాద్, సిబ్బంది పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు.

దోమకాటు... ఆరోగ్యానికి చేటు!

- సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- ప్రజలను చైతన్య పరుస్తున్న ఆరోగ్య, వైద్య సిబ్బంది

డోన్ : సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువున్న వర్షాకాలం ప్రారంభమైంది. ఈ సీజన్‌లో దోమకాటు ఆరోగ్యానికి చేటు అంటున్నారు వైద్యులు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు తదితర వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్న వైద్యులు దోమ కాటు ఆరోగ్యానికి చేటు అంటున్నారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. సిబ్బంది ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ ఆరోగ్య సూత్రాలపై చైతన్య పరుస్తున్నారు. ప్రత్యేకించి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ సూచనలు చేస్తున్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ప్రయోజనాలు తెలుపుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. ఇళ్ల ఎదుట మురుగు కాల్వలు, డ్రమ్ములలో నీటి నిల్వల మూలంగా సోకే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తునారు ఆరోగ్య, వైద్య సిబ్బంది. వైద్య సూచనల మేరకు దోమకాటుతో సోకే వ్యాధులు, నివారణ చర్యలు ఇలా...

మలేరియా...

విపరీతమైన చలి, వణుకుతో కూడిన తీవ్రమైన జ్వరం, తలనొప్పులు, ఒళ్లునొప్పులు, వికారంతో కూడిన వాంతులు, అనాఫిలస్ దోమ కాటుద్వారా వ్యాప్తిచెందే అవకాశం ఉందన్నారు. వైద్యుల సూచనల మేరకు నివారణకు ఫ్లోరోక్విన్, ప్రై మాక్విన్ మాత్రలు వాడాల్సి ఉంటుంది.



నీటి నిల్వ ఉన్న తొట్టిలో ఆయిల్ కలుపుతున్న ఆశావర్కర్ (ఫైల్)

డెంగీ....

జ్వరం, హెమరేజ్, షాక్ సిండ్రోమ్ లక్షణాలు కలిగించే ఈ వ్యాధి తీవ్ర జ్వరంతో మొదలవుతుందన్నారు. కనురెప్పలు లేపలేని పరిస్థితి ఉంటుంది. ఎముకలు, కండరాళ్లలో భరించలేని నొప్పి. శరీరంపై పొక్కులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాంతులు, రక్తంతో కూడిన మల విసర్జన ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఈ వ్యాధి ఆడ ఎడిష్ దోమ కాటు ద్వారా ప్రబలే అవకాశం ఎక్కువ. ఈ వైరస్ వల్ల కలిగే వ్యాధికి పూర్తిస్థాయి చికిత్స లేదు. లక్షణాల మేరకు చికిత్స అందించే అవకాశం ఉందంటున్నారు వైద్యులు.

చికెన్‌గున్యా...

అకస్మాత్తుగా వచ్చే జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు కనిపించేవి చికెన్‌గున్యా లక్షణాలు. కీళ్ల దగ్గర భరించలేని బాధ ఉంటుంది. ఆడ ఏడిస్ దోమకాటు ద్వారా వ్యాపించే వైరస్‌తో ఈ వ్యాధి సంక్రమిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

అవగాహన పెంచుకోవాలి



ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి. వర్షాకాలంలో ప్రబలే అంటు వ్యాధుల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. చిన్నపిల్లలను మరింత జాగ్రత్తతో సంరక్షించుకోవాలి. జ్వరం, దగ్గు, జలుబు లాంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. వ్యకిగతంతోపాటు పరిసరాల శుభ్రత ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి. వైద్యుల సూచనలతోపాటు ప్రజలు చైతన్యమైతేనే వ్యాధుల కట్టడి సాధ్యం.

– డా.మాధవ కృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, చిన్న పిల్లల వైద్య నిపుణులు

దోమలను నియంత్రించాలి..ఇలా

ప్రతిఒక్కరూ వారారికి ఓసారి డ్రై డేను పాటిస్తే దోమలను నియంత్రించ వచ్చు. ఇళ్ల ఎదుట నీటి నిల్వలు, మురుగు కాల్వల్లో కిరోసిన్ లేదా ఆయిల్ బాల్స్ వేయాలి. ప్రతిఒక్కరూ దోమతెరలు అలవాటు చేసుకోవాలి. ఇంటి కిటికీలకు, తలుపులకు మెస్‌లు బిగించడంతోపాటు రాత్రి మస్కిటో కాయిల్స్, రీఫిల్స్ వాడాలి. వేపాకుపొగ పెట్టడం ద్వారా దోమలను నియంత్రించవచ్చు. ఎయిర్ కూలర్లు, ఫ్రిడ్జ్‌లు, ఫ్లవర్‌వాజ్‌లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి తొట్లు, పాత్రలు, పశువుల తొట్లపై ఖచ్చితంగా మూతలు ఉండేట్లు జాగ్రత్తలు పాటించాలి. అదేవిధంగా పూలకుండీలు, వాడేసిన కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ టీకప్పులు, కుండ పెంకులు, వాడని పాత్రలు, సీసాలలో నీటి నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఓటర్ జాబితా పరిశీలన బాధ్యతగా నిర్వహించాలి

బేతంచెర్ల: ఓటర్ జాబితా పరిశీలనలో ఇంటింటికి వెళ్లి బాధ్యతగా నిర్వహించాలని, వివరాలను యాప్‌లో సక్రమంగా నమోదు చేయాలని ఆర్డీఓ వెంకట రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను ఆర్డీఓ పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు నమోదు చేయాలని సూచించారు. అలాగే మరణించిన వ్యక్తుల ఓటర్లను తొలగించాలని, తప్పులు ఉంటే ఓటర్‌తో మాట్లాడి సరిచేయాలన్నారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



యాప్‌లో ఓటర్ వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు

- పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్

డోన్ టౌన్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించిన కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రౌడీషీటర్లను హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లుగా పేర్లు నమోదు అయిన వారు కేసుల్లో ఇరుక్కుంటే కఠినంగా శిక్షిస్తామన్నారు. పట్టణంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా రౌడీషీటర్లను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందనే విషయాన్ని గుర్తించి సమాజంలో మంచిగా జీవనం సాగించాలని సూచించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న సమాచారం ఇచ్చినవారికి అండగా ఉంటామని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ప్రవీణ్ కుమార్

యాసిడ్ వినియోగంపై సమాచారం ఇవ్వాలి

డోన్ టౌన్ : బంగారు వ్యాపారస్తులు యాసిడ్ ఉపయోగిస్తే అందుకు సంబంధించిన వివరాలను పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం పట్టణ స్వర్ణకారులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. యాసిడ్‌ను తగిన జాగ్రత్తలతో వినియోగించాలని, సరఫరా చేసే డీలర్ పేరు, లైసెన్స్ తదితర వాటి వివరాలు తెలియజేయాలని సూచించారు. రోజుకు ఎంత దిగుమతి చేసుకుంటున్నారు,ఎంత వినియోగిస్తున్నామనే వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలన్నారు. అలాగే దుకాణం లోపల, బయట సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి గస్తీ కోసం ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులను స్వయంగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

బనగానపల్లె: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల వద్దకే పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు షేక్ జిలానీబాషా స్పష్టం చేశారు. షేక్ జిలానీ బాషా ఈ నెల 15 నుంచి మార్కాపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్ర చేపట్టిన ఆదివారం టంగుటూరు, అప్పలాపురం, కైప గ్రామాల మీదుగా బనగానపల్లెకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నియోజకవర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. పాదయాత్రలో ప్రజలతో చర్చించిన అంశాలను యాత్ర ముగిసిన తరువాత వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.



అప్పలాపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న షేక్ జిలానీబాషా

కొలువుదీరిన పీర్లు

కోవెలకుంట్ల: మండల కేంద్రం కోవెలకుంట్లతోపాటు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. చావిళ్లలో పీర్ల దేవుళ్ల కొలువుదీరారు. 26వ తేదీ నుంచి మూడు రోజులపాటు సరిగెత్తు వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా బుధవారం చిన్నసరిగెత్తు, గురువారం మధ్యసరిగెత్తు, శుక్రవారం పెద్ద సరిగెత్తు, 29వ తేదీన పీర్ల నిమజ్జనంతో మొహర్రం వేడుకలు ముగియనున్నాయి.

నూతన పీర్ల చావిడి ప్రారంభోత్సవం

డోన్ టౌన్ : మండలంలోని వెంకటాపురంలో ప్రజలు ఐకమత్యంగా కులమతాలకు అతీతంగా చందాలు వేసుకొని నిర్మించిన పీర్ల చావిడిని ఆదివారం గ్రామ పెద్దలు ప్రారంభించారు. గతంలోని పీర్ల చావిడి పురాతనమైనందున గ్రామస్తులు ఐకమత్యంగా చందాలు వేసుకుని కొత్తచావిడి నిర్మాణం చేపట్టారు. మోహరం సందర్భంగా సాయంత్రం పీర్ల పెట్టెకు గ్రామోత్సవం నిర్వహించి విందు భోజనం ఏర్పాటు చేశారు.

బంకుకు నిప్పంటించిన దుండగులు

బనగానపల్లెరూరల్: మండలంలోని పసుపల గ్రామానికి చెందిన వెంకటేశ్వరయ్య బంకుకు గుర్తు తెలియని దుండగులు నిప్పంచడంతో పూర్తిగా దగ్ధమైంది. బాధితుడి వివరాల మేరకు గ్రామంలో చిన్న బంకు పెట్టుకొని టీ హోటల్ నిర్వహిస్తున్నాడు. కొందరు దుండగులు శనివారం అర్ధరాత్రి బంకుకు నిప్పంచడంతో బంకుతో పాటు సామగ్రి దగ్ధమైందని, దాదాపు 20వేలు నష్టం వాటిల్లిందని వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బనగానపల్లె పోలీసులు కేసు నమోదు చేశారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

డోన్ టౌన్ : ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఏమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఆగస్టులో చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి మాదిగలు తరలిరావాలని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ, రాబిన్ సన్, నంద్యాల జిల్లా అధక్షులు సుభాష్ చంద్ర, జిల్లా కన్వీనర్ పులికేశవయ్య మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీవోస్ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 29 సంవత్సరాలు పోరాడుతున్నా రాజకీయ పార్టీలు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కోసన పల్లె రామాంజనేయులు, శివనారాయణ, ఓబులేసు, చినరాయుడు, సంజీవుడు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలు హర్షించేలా జగనన్న పాలన

- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి. మాజీ జెడ్పీ చైర్మన్ మల్కిరెడ్డి, వైఎస్ ఎంపీపీ చిన్న బాబు

సంజామల: రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలు హర్షించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్న బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్ బాబు, తలారి లక్ష్మి నారాయణ, ఎంపీడీఓ నాగ కుమార్, తహసీల్దార్ మల్లికార్జున రావు, సర్పంచ్ ఆందనం శృతి తదితరులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాలు బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఆయా వివరాల మేరకు సంక్షేమ పథకాలు అందయా లేదా అని కాటసాని ఆరాతీయగా లబ్ధి చేకూరిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని పేదల వివరాలు అందజేస్తే న్యాయం చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని హామీ ఇచ్చారు. సాంకేతిక కారణాల మూలంగా సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులకూ న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు రహమతుల్లా, రామిరెడ్డి పల్లె సర్పంచ్ సోమసుందర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోట పాడు రామసుబ్బయ్య, నాగేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, బాబు, శ్రీనివాసులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా పేరుసోమలకు వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముందుగా అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.35 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన నూతన రైతుభరోసా కేంద్రం భవనాలను ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు అందజేసేందుకు ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఆదేవిధంగా రైతులకు అనుగుణంగా రైతుభరోసా కేంద్రాలను తీసుకొచ్చి విత్తు నుంచి దిగుబడుల విక్రయాల వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వలంటీర్ వ్యవస్థను అభినందిస్తుంటే జనసేన అధ్యక్షుడు పవన్ మాత్రం విమర్శలు గుప్పించడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు.

అండగా నిలిచారు... ధైర్యాన్నిచ్చారు!



అబ్దుల్ శుకూర్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉస్సేన్ వలీ(ఫైల్)

ఈ చిత్రంలోపెన్షన్ అందజేస్తున్న యువకుడు పేరు ఉసేన్‌వలీ. సంజామల మండలం నొస్సం గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. డిగ్రీ పూర్తి చేసినా సేవ భావంతో వలంటీర్‌గా చేరి ప్రజల మన్ననలు పొందుతున్నాడు. కరోనా కష్టకాలంలో ఆ గ్రామానికి చెందిన వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు అండగా నిలుస్తూ మనోధైర్యాన్ని కల్పించారు. ఎక్కడ కరోనా మహమ్మారి సోకుతుందనని భయభ్రాంతులకు గురైన ప్రజలకు సూచనలిస్తూ అండగా నిలిచిన వలంటీర్ల సేవలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు ప్రజలు. ప్రజలు బయటికి రాని పరిస్థితులలో ప్రభుత్వ సాయంతోపాటు పింఛన్, నిత్యావసర సరుకులు అందజేసిన సందర్భాలను కొనియాడుతున్నారు. ఏప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీస్తూ అవసరమేరకు ఉచితంగా మందులు పంపిణీ చేసిన సాయాన్ని గుర్తు చేస్తున్నారు ప్రజలు. – సంజామల

కుటుంబ సభ్యుడిలా సేవలు



వలంటీరులు అంకితభావంతో సేవలు అందజేస్తున్నారు. ప్రత్యేకించి కరోనా సమయంలో కుటుంబ సభ్యులుగా మెలుగుతూ సాయపడ్డారు. నా విషయంలో వలంటీర్ ఉస్సేన్ వలీ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేను. ప్రభుత్వ నుంచి వచ్చిన ఏ సాయం అయిన వెంటనే అందించేవాడు. కరోన కాలంలో మాస్క్‌లు, కూరగాయలు అందిచాడు. ప్రతిఒక్కరినీ పలుకరిస్తూ ఆరోగ్య విషయాలపై ఆరా తీశాడు. ఏ మాత్రం అనుమానం ఉన్నా వెంటనే కరోనా పరీక్షలు చేయించి అండగా నిలిచిన తీరు ఎప్పటీకీ గుర్తుంటుంది. – అబ్దుల్ శుకూర్, నొస్సం

కష్టకాలంలో మనోధైర్యం కల్పిస్తూ...



పింఛన్ సొమ్ము అందజేసేందుకు బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ శ్రావణి (ఫైల్)

ఈ చిత్రంలో ఓ మహిళకు బయోమెట్రిక్ ద్వారా పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న శ్రావణి డోన్ పట్టణ పరిధిలోని 15వ వార్డు సచివాలయ వలంటీర్. తన పరిధిలోని కుటుంబాలకు అన్నివిధాలా సేవలు అందజేస్తూ అందరి మన్ననలు పొందుతుంది. ప్రత్యేకించి కరోనా కష్టకాలంలో శ్రావణి ఎంతో ధైర్యంగా ప్రజలకు సేవలందించారు. ప్రతి ఇంటినీ తలుపుతట్టి యోగక్షేమాలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం సాయంతోపాటు దాతల నుంచి సేకరించిన నిత్యావసర సరులకు అందజేస్తూ అండగా నిలిచారు. హోంక్వారంటైన్‌లో ఉన్నవారికి అందుబాటులో ఉంటూ ఏమీ కాదని కల్పించిన మనోధైర్యాన్ని గుర్తు చేసుకుంటున్నారు ఆయా కాలనీల ప్రజలు. – డోన్

సేవాదృక్పథంతో సాయం

వలంటీర్ల సేవలు ప్రజలకు చాలా ఉపయోగపడుతున్నాయి. ఆడపిల్ల అయినా వలంటీర్ శ్రావణి ఏ మాత్రం భయపడకుండా కరోనా సమయంలో సేవా దృక్పథంతో సేవలందిచింది. నిత్యావసర సరుకులతోపాటు ప్రభుత్వ సాయం అందజేసి అండగా నిలిచింది. బయటకు రాలేని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా 31వ తేదీ అర్ధరాత్రి దాటిన వెంటనే పింఛన్ అందజేసిన తీరును ఎప్పటీకీ మరిపోలేను. ఎవరేమనుకున్నా వలంటీర్ల సేవలు బాగున్నాయన్నది వాస్తవం.

– సరస్వతి, టి.ఆర్.నగర్, డోన్.

పేరుసోములలో టీడీపీకి భారీ షాక్ !

- వారంలో 100 కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీలో చేరిక



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పేరుసోముల గ్రామస్తులు

సంజామల: మండలం పరిధిలోని పేరుసోముల గ్రామంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. కేవలం వారం రోజుల్లో ఆ గ్రామానికి చెందిన టీడీపీ మద్దతు 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ నెల 17వ తేదీన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. అదేవిధంగా ఆదివారం పేరుసోములలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన నేపథ్యంలో మరో 50 కుటుంబాలు వైస్ ఎంపీపీ చిన్న బాబు ఆధ్వర్యంలో కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. గ్రామానికి చెందిన బెస్త ఆశోక్, మిద్దె బాల పుల్లయ్య, చమురు నడిపెన్న, కృష్ణయ్య, కవిత, శ్రీనివాసులు, బాబు, సిలార్బి తదితరులకు ఎమ్మెల్యే కాటసాని పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, పాలనపట్ల ఆకర్షితులై చాలా మంది పార్టీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, పేరుసోముల సర్పంచ్ అనదనం శృతి, రామిరెడ్డి పల్లె సర్పంచ్ రామసుందర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరిపై కేసు నమోదు

కోవెలకుంట్ల: ఓ యువతిని పెళ్లిపేరుతో వేధింపులకు గురిచేసిన ఇద్దరిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు రేవనూరు ఎస్ఐ కల్పన తెలిపారు. ఎస్ఐ అందించిన సమాచారం మేరకు రేవనూరుకు చెందిన ఓ యువతి ఒంటరిగా ఇంటి వద్ద ఉండగా అవుకు మండలం కునుకుంట్ల గ్రామానికి చెందిన వరుసకు బంధువైన ప్రతాప్ తనను పెళ్లి చేసుకోవాలంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. యువతి అక్కడి నుంచి తప్పించుకుని బంధువుల ఇంటికి వెళ్లింది. తల్లి వచ్చాక విషయం తెలపడంతో పోలీసులను ఆశ్రయించారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు ప్రతాప్, మరో వ్యక్తి బ్రహ్మ నాయుడిపై సెక్షన్ 341కింద కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యం అయినట్లు బాధితులు పోలీస్ స్టేషన్‌ల్లో ఆదివారం ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ వివరాల మేరకు గ్రామానికి చెందిన పటాన్ వలీఖాన్ కుమార్తె చాందినీ ఈనెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయా ప్రాంతాల్లో గాలించినా ఆచూకి తెలియలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బనగానపల్లెరూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని రామతీర్థంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగసుంకన్న తీవ్రగాయపడినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. పొలం నుంచి ఇంటికి వస్తుండగా వెనుక వైపు నుంచి బోలేర వాహనం ప్రమాదశాత్తు ఢీకొట్టింది. దీంతో నాగ సుంకన్న నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరంలో ఐదు మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆదివారం తెలిపారు. చెరువుపల్లె రోడ్డులో గ్రామానికి చెందిన సామేల్, శిరివెళ్ల సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లుతో పాటు మరో ఇద్దరు పేకాట ఆడుతుండగా దాడిచేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. రూ.1800లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్వాటర్ బాటిళ్లు స్వాధీనం

డోన్ టౌన్ : మండలంలోని ధర్మారం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ సుధాకర్ రెడ్డి ఆదివారం తెలిపారు. మనోహర్ నాయుడు, బోయ మద్దయ్య నుంచి 56 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

రక్తదానంతో ప్రాణ దానం

బేతంచెర్ల: ప్రమాద సమయంలో బాధితులకు మనం చేసే రక్తదానం ప్రాణ దానంతో సమానం అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలీ, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజ హుసేన్ అన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిధుల కొరత నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో గతనెలలో గుండెపోటుతో మరణించిన లైఫ్అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి జ్ఞాపకార్థం యువనేత్ర సేవా సమితి, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ను ఏర్పాటు చేశారు. ముందుగా లైఫ్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రక్తదానం శిబిరాన్ని లైఫ్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులు, ఎంపీపీ, చైర్మన్, ఎస్ఐ శివ శంకర్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బేతంచెర్ల లైఫ్‌రక్ష సహాయం బృందం, లైఫ్ యువనేత్ర సమితి సభ్యులను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు రక్తదానం చేస్తే ఏ మాత్రం కొరత ఉండదన్నారు. అలాగే లైఫ్ కన్వీనర్ రవి కుమార్ 107వ సారి రక్తదానం చేయడంతో అభినందించి మెమోంటో అందజేశారు. సేవా కార్యక్రమాలతో పాటు రక్తదాన శిబిరం ఏర్పాటుకు సహకరించిన నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ని సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు గౌరి హుసేన్‌రెడ్డి,బూషిరెడ్డి, సత్తార్, మాణిక్యం పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్ఐ శివ శంకర్ నాయక్